ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
శనివారం 27 జనవరి 2024


పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు



కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న అధికారులు, స్వాతంత్ర్య సమరయోధుడు బహదూర్ సింగ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్


ప్రగతి సందేశాన్ని వినిపిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా సమగ్రాభివృద్ధికి అధికార యంత్రాంగం కృషి
- 'మహాలక్ష్మి'తో 16.53 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం
- రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 1161 మందికి వైద్య సేవలు
- 'ప్రజా పాలన'తో ప్రజల చెంతకే ప్రభుత్వం
- 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డీసీపీ సీతారామ్‌తో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ఉద్యమ ఆకాంక్షలు దక్కాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచంతో పోటీ పడి సరికొత్త అధ్యాయాన్ని లిఖించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి రెండు మానవీయ పథకాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. తెలంగాణ ఆడబిడ్డలను మహాలక్ష్ములను చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన అన్నారు. అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిందన్నారు. ఆర్థిక పురోగతి సాధనే లక్ష్యంగా వివిధ పనుల రీత్యా బస్సు ప్రయాణాలు చేసే మహిళలకు ఈ పథకం ఉపకరిస్తోందన్నారు. ప్రయాణాలకు పెట్టే ఖర్చు మినహాయింపు జరగడం ద్వారా వాటిని ఇతర కుటుంబ అవసరాలకు ఉపయోగించుకునే అవకాశం దక్కిందన్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 9 నుంచి ఇప్పటి వరకు 16 లక్షల 53 వేల 502 మంది మహిళలు మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించారన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద గతంలో ఉన్న రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవల పరిమితిని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిందని కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. ఈ పథకం పేద, మధ్య తరగతి కుటుంబాలకు వరంలా మారిందన్నారు. ఈ పథకం ద్వారా ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1161 మందికి రూ.3.19 కోట్ల విలువైన వైద్య సేవలు అందించామన్నారు. ప్రజల చెంతకే ప్రభుత్వం వెళ్లాలన్న ఆలోచనతో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. జిల్లాలోని 281 గ్రామ పంచాయతీలు, 30 మునిసిపల్ వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి ఆరు గ్యారెంటీలైన మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత వంటి పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించామన్నారు. ప్రతి గ్రామంలో క్యాంపులను నిర్వహించి ఈ దరఖాస్తుల స్వీకరణను చేప ట్టామన్నారు. ప్రజా పాలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,77,382 దరఖాస్తులు రాగా వాటిని ప్రభుత్వం నిర్దేశించిన పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ప్రజా పాలనకు సంబం ధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రక్రియ చేప ట్టేందుకు జిల్లా యంత్రాంగం అంతా సన్నద్ధంగా ఉందన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతీ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రణాళికలను రూపొందించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. రైతు బాగుంటేనే ఊరు బాగుంటుందనే ఉద్దేశంతో రైతును బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రజావాణి కార్యక్రమాల్లో భాగంగా ఎక్కువగా ధరణి సంబంధిత సమస్యలే వస్తున్నాయని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇందులో భాగంగా ధరణి స్థానంలో 'భూమాత' పోర్టల్‌ను తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారన్నారు. జిల్లాలో రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో పాటు రైతుభరోసా కింద ఈ యాసంగి సీజన్‌లో 75,168 మంది రైతుల ఖాతాల్లో రూ.28.56 కోట్లను జమ చేశామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందన్నారు. ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకోవడం ద్వారా న్యాయం జరుగుతుందన్న ఆలోచనలో హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రంతో పాటు స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలను తయారు చేస్తోందన్నారు. జిల్లాలో అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసుల పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు.


బెలూన్లను ఎగురవేస్తున్న కలెక్టర్, డీసీపీ సీతారామ్

ఘనంగా గణతంత్ర దినోత్సవం

పతాకావిష్కరణ చేసిన కలెక్టర్
హాజరైన ఎమ్మెల్యేలు పల్లా, కడియం

జనగామ కల్చరల్, జనవరి 26 : జిల్లాలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ అనంతరం కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య మినీ స్టేడియంలో వేడుకలకు హాజరయ్యారు. పతాకావిష్కరణ అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తరువాత సభికులనుద్దేశించి ప్రగతి సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. తదుపరి ఉత్తములకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా స్టేడియంలో పలు శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్‌కుమార్ స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమానికి అతిథులుగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, డీసీపీ సీతారాం, జడ్పీ చైర్‌పర్సన్ భాగ్య లక్ష్మి, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు మురళీకృష్ణ, వాసం రాంమూర్తి, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రవిందర్, డీఆర్‌డీవో మొగులప్ప, సీపీవో ఇస్మాయిల్, జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా

మిగతా 8వ పేజీలో...


మినీ స్టేడియంలో జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఎమ్మెల్యే పల్లాపై భూకబ్జా కేసు

భూమిని వదులుకోకుంటే చంపేస్తామన్నారని మహిళ ఫిర్యాదు
పోచారం పీఎస్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు


పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 26 : భూకబ్జా విషయంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదైంది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఆయన భార్య నీలిమా, మరో వ్యక్తి మధుకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే.. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని బుద్ధనగర్‌కు చెందిన ముచ్చెర్ల రాధిక ఈ నెల 23న పోచారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. తమకు సంబంధించిన ప్లాట్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నీలిమా, మధుకర్‌రెడ్డి అక్రమంగా కబ్జా చేశారని, దీనిపై ప్రశ్నిస్తే అసభ్యంగా దూషించారని ఫిర్యాదు చేశారు. డూప్లికేట్ డాక్యుమెంట్లు సృష్టించి లేఔట్ వివరాలను మార్చేసి తమ ప్లాటులోకి చొరబడ్డారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించినందుకు తమపై బెదిరింపులకు దిగారని, స్థలాన్ని వదులుకోకుంటే చంపేస్తామంటూ బెదిరించినట్లు బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు. పల్లా కుటుంబంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు ఈ నెల 23న ఐపీసీ 427, 447, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా ఈ విషయం ఈ నెల 26న శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది.

అక్రమంగా కేసు బనాయించారు : పల్లా

తనపై నమోదైన కేసు విషయంపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. తాను, తన భార్య ఎవరినీ బెదిరించలేదని, కావాలనే తమపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. సంఘటన ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎవరెవరు ఉన్నారనేవి పరిశీలించకుండా కేసు నమోదు చేశారన్నారు. ఎవరెన్ని కేసులు పెట్టినా తాను భయపడేది లేదని, న్యాయ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

రాజ్యాంగ విలువలు లేని గవర్నర్

కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు..
స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ విలువలను కాపాడాలన్న విషయాన్ని మరిచిపోయి బీజేపీ పార్టీ ప్రతినిధి లాగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జనగామ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు గవర్నర్ తీరు, సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురించి గవర్నర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, ఇది సరికాదని కడియం శ్రీహరి అన్నారు. గత ప్రభుత్వమైనా, ప్రస్తుత ప్రభుత్వమైనా ప్రభుత్వాధినేత గవర్నరే అన్న విషయాన్ని ఆమె మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వంలో తప్పు జరిగితే ఆ తప్పు గవర్నర్‌ది కూడా అవుతోందన్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండి ఇలా మాట్లాడడం సరికాదన్నారు. తమిళిసై లాంటి గవర్నర్‌ను చూసిన తర్వాత గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడమే సమంజసమనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను గవర్నర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు.అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 50 రోజులు అవుతున్నా కేవలం రెండే హామీలను అమలు చేసిందని శ్రీహరి విమర్శించారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రైతులంతా వెంటనే రుణాలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి మభ్యపెట్టి ఇంతవరకు రుణమాఫీని చేయలేదని అన్నారు. కేసీఆర్‌ను చార్లెస్ శోభ్రాజ్, కేటీఆర్, హరీశ్‌రావును బిల్లా రంగాలంటూ రేవంత్‌రెడ్డి అహంకారపూరితంగా మాట్లాడారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని బెదిరించాలనే ధోరణితో సీఎం మాట్లాడుతున్నారని, ఇలాంటి బెదిరింపులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. ఫిబ్రవరి నెలలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని, ఈలోగా బీఆర్ఎస్‌పై నెపం నెట్టి కాలయాపన చేయాలని కాంగ్రెస్ భావిస్తోందన్నారు.

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై కాంగ్రెస్ పార్టీ రోజుకో కేసు పెట్టాలని చూస్తోందని అన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు తాను, బీఆర్ఎస్ పార్టీ గానీ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలు సాధారణ కార్యకర్త కూడా మాట్లాడరన్నారు. కాళేశ్వరం మీద మంత్రులు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బాష అహంకారపూరితంగా ఉందని అన్నారు. రైతుబంధు రాలేదన్న వాడిని చెప్పుతో కొడతానంటూ మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్సీగా కోదండరామ్‌ను అంగీకరించిన గవర్నర్ దాసోజు శ్రవణ్‌ను ఎందుకు అంగీకరించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇవ్వలేదని ఆమె మాట్లాడడం సరికాదని, తమ హయాంలో రాష్ట్రంలో ఒక లక్షా యాభై వేల ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రిటైర్డ్ అధికారులను నియమించారని మాట్లాడుతున్నారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అదే రిటైర్డ్ అధికారులను సలహాదారులుగా నియమించుకున్నారని తెలిపారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ విభాగం కలిసి తీన్మార్ మల్లన్న అనే చోటా నయీమ్‌ను తయారు చేశారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. తీన్మార్ మల్లన్న ఘట్కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో గూండాలను పంపించి వసూళ్లకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇలాంటి చోటా నయీమ్‌లతో ప్రజలకు ముప్పు ఉంటుందని అన్నారు. తన లాంటి వ్యక్తినే బెదిరిస్తున్నారంటే పేదలను ఎంతలా బెదిరిస్తారో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, జడ్పీ ఛైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, నాయకులు ప్రేమలతారెడ్డి, సేవెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

గడ్డం సమ్మయ్యకు అభినందనల వెల్లువ

'పద్మశ్రీ' పురస్కారం రావడంపై ఎమ్మెల్యేల సత్కారం

దేవరుప్పుల, జనవరి 26 : మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు ఘనంగా సన్మానించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డిలు శుక్రవారం గ్రామానికి చేరుకుని సమ్మయ్యను సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే దిశలో సమ్మయ్య చేసిన కృషి అభినందనీయమని అన్నారు. 30 సంవత్సరాలుగా సమ్మయ్యతో తనకు పరిచయం ఉందని, అనేక కార్యక్రమాలు కలిసి చేశామన్నారు. చిందుయక్ష గానం ద్వారా పురాణాలకు సంబంధించిన ఇతివృత్తాలను, ఇతిహాసాన్ని ప్రజలకు తెలియజేశారన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఆస్వాదించినంత వరకు ఆ కళలు అంతరించిపోకుండా అజరామరంగా ఉంటాయని అన్నారు. గడ్డం సమ్మయ్యను అభినందిస్తూ పద్మశ్రీ పురస్కారం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ ప్రాంత కళలను గౌరవించి సమ్మయ్యకు అవార్డు ఇచ్చిందన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో పాటు హాజరై సమ్మయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించి మాట్లాడారు. గ్రామీణ కళలు అంతరించిపోకుండా సమ్మయ్య తన బృందంతో ముప్పై ఏళ్లుగా అనేక ప్రదర్శనలు ఇచ్చి కాపాడారన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ గడ్డం సమ్మయ్యను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పద్మశ్రీకి ఎంపికైన గడ్డం సమ్మయ్య దేవరుప్పుల మండల వ్యక్తి కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమయ్యను ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించారు. మోదీ ప్రభుత్వం బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠకు సమ్మయ్యను ఆహ్వానించగా ఐదు రోజులు తన బృందంతో అయోధ్యలో ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు.


పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

మహాజాతరకు సకల ఏర్పాట్లు

- ఈ నెలాఖరులోగా పనులు పూర్తవుతాయి
- మేడారంలో మంత్రి సీతక్క
- పనుల పురోగతి పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశం


మేడారంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జనవరి 26: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క తాడ్వాయి మండలం మేడారంలో శుక్రవారం పర్యటించారు. ఆకస్మికంగా వచ్చి పనుల నాణ్యత ప్రమాణాలు, పురోగతిని తనిఖీ చేశారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరిగే సమ్మక్క సారలమ్మల మహాజాతరకు వచ్చే భక్తకోటికి సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసింది. పలు శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని తిరిగి పరిశీలించారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి.. పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. శాశ్వత, తాత్కాలిక ఏర్పాట్ల నిర్మాణపనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఈ నెలాఖరులో పూర్తిచేయాలని సూచించారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు.

ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, రహదారుల నిర్మాణ పనులు, హరిత హోటల్ మరమ్మతులు, జంపన్నవాగు ఇసుక చదును, ఊటబావుల పూడికతీత, స్నానఘట్టాలపై బాతింగ్ గాడ్స్, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, కొత్తూరు సమీపంలోని తాత్కాలిక మరుగుదొడ్లు, స్థూపంరోడ్, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ దేవాలయం పరిసరాలు పరిశీలించారు. పూజారి కాక రంజిత్ దేవాలయ సమీపంలో మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. వెంటనే అధికారులను మంత్రి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అనంతరం మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని అన్నారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల చివరిలోపు జాతర పనులు పూర్తవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఈవో రాజేంద్రం, డీపీవో వెంకయ్య, ఇంజనీరింగ్ అధికారులు అజయ్ కుమార్, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజి కరకట్ట నిర్మించండి

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్



మ్యాపు ద్వారా ఎమ్మెల్యే వివేక్‌కు వివరిస్తున్న ఈఎన్‌సీ

మహదేవపూర్, జనవరి 26: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బ్యారేజి వెనక వైపుకు కరకట్ట నిర్మించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. శుక్రవారం చెన్నూరు నియోజక వర్గానికి సంబంధించిన రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజిని సందర్శించారు. బ్యారేజిని నిర్మించినప్పటి నుండి ఐదు సంవత్సరాలుగా తమ భూములు ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజి వద్దకు చేరుకొని గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. బ్యారేజి వెనుకవైపుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి, అక్కడే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ వెంకటేశ్వర్లుకు తెలియజేశారు. తమ భూములు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే వివేక్ ఈఎన్‌సీని ప్రశ్నించగా తాము బ్యారేజి వెనకవైపుకు 5.7 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు ప్రపోజల్ పంపించామని, అయితే అప్పుడున్న ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పనులు మొదలుకాలేదని వివరించారు. దీనికోసం 132 కోట్లు అవసరమవుతాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తాను సంబంధిత మంత్రితో, అధికారులతో మాట్లాడతానని, పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఈఎన్‌సికి సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గుడుంబాను అడ్డుకుంటే కేసులు పెడతారా?

ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

హనుమకొండక్రైం, జనవరి 26: ఎక్సైజ్‌శాఖలో విధుల్లో భాగంగా తాము ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని గుడుంబాను నియంత్రించేందుకు కట్టుదిట్టం చేస్తే తమ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమసిబ్బందిపైనే పోలీసు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రొహిబిషన్ అండర్ ఎక్సైజ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. గీసుగొండ మండలం జాన్‌పాక గ్రామానికి చెందిన తేజావత్ బుజ్జి చేసిన ఆరోపణలపై శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తేజావత్ బుజ్జిపై దాడి చేసినట్టు చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. గుడుంబాను విక్రయించకూడదని హెచ్చరించినందుకు కక్షగట్టి తన ఇన్‌స్పెక్టర్ రమేష్‌చందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం సరైంది కాదని అన్నారు. దీనిపై పోలీసులు మరో మారు పునరాలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణ, చంద్రమోహన్, రమేష్‌చందర్, శశికుమారి పాల్గొన్నారు.



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు

నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తా..

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

సుబేదారి, జనవరి 26: నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తానని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. పౌల్ట్రీ పితామహుడు స్వర్గీయ డాక్టర్ బీవీ రావు 28వ వర్ధంతిని హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బీవీ రావు స్మారకార్థం కోడిగుడ్లను పంపిణీ చేశారు. నెక్ అభివృద్ధికి బీవీరావు ఎంతో కృషి చేశారని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రదీప్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య, వైస్ చైర్మన్ దండ కరుణాకర్‌రెడ్డి, నెక్ జోనల్ కమిటీ మెంబర్లు టి. సుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.రమణారెడ్డి, కోశాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్పార్కిల్



పాటలు పాడుతున్న రామ్ మిర్యాల

హసన్‌పర్తి, జనవరి 26 : మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిలో శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక సంబరం స్పార్కిల్-24 అలరించింది. ప్రముఖ సినీ గాయకుడు రామ్ మిరియాల పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు. చెమ్కీల అంగిలేసీ ఓ వదినే.., పొట్టిపిల్లా..పొట్టి పిల్లా.., ఓ మాయా మాయా ఓరి మాయారే.., చిట్టీ నీనవ్వంటే లక్ష్మీ పటాసు..వంటి పాటలతో ఉర్రూతలూగించారు. మరో సినీ గాయని సింధూజ శ్రీనివాస్, పాడుతా తీయగా ఫేం శ్రీనివాస భరద్వాజల సినీ గీతాలతో ఉత్తేజపరిచారు. వీరి పాటలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేస్తూ కళాశాల ప్రాంగణం అంతా దుమ్ములేపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం ద్రౌపది వస్త్రాభరణం ఆకట్టుకుంది. జానపద గీతాల నృత్యాలతో ఉత్సాహపరిచారు. అనంతరం యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి వివిధ ఈవెంట్లలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు జరిగిన స్పార్కిల్ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్లు రాజేశ్వర్‌రావు, వినూత్న, శ్రీకర్‌రెడ్డి, డీన్ ఏవీవీ సుధాకర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

బల్దియాలో గణతంత్ర వేడుకలు



గణతంత్ర వేడుకల్లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 26: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన వేడుకల్లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నగర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాల గురించి రిజ్వాన్ తెలియచేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన బల్దియా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఇటీవలే బల్దియా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో..

హనుమకొండ క్రైం: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను వరంగల్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంతో పాటు నగరంలోని పలు పోలీసు స్టేషన్‌లు, ఎక్సైజ్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయంలో స్థానిక పోలీసు అధికారులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం అక్కడి పోలీసు అధికారులు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు స్వీట్లు పంచారు. తోటి సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని దేశభక్తిని చాటుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయం వద్ద సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని సిబ్బందితో కలిసి ఆలపించారు. అనంతరం సేవా, ఉత్కృష్ట పతకాలను పొందిన పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి పతకాలను సీపీ చేతుల మీదుగా అందించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవయ్యతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కేయూలో...

కేయూ క్యాంపస్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వివేచన 19 వాల్యూ 1వ సంచికను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు.



కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ జెండాకు నమస్కరిస్తున్న సీపీ, పోలీసు అధికారులు



కేయూలో ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, జనవరి 26: మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని శాకరాసికుంటలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.1.65లక్షల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. శాకరాసికుంటకు చెందిన ఎనగందుల రాజు కొంతకాలంగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి మూకుమ్మడిగా దాడులు చేసి అక్రమమద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజు పోలీసులను చూసి పరారయ్యాడు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ సివిల్ పోలీసులు పాల్గొన్నారు. పట్టుకున్న మద్యాన్ని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట, జనవరి 26: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలో 16 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒడిస్సాకు చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి 16 కిలోల ఎండు గంజాయితో పట్టుబడ్డారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



మృతుడు సురేష్ (ఫైల్)

నర్సింహులపేట, జనవరి26: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ మండలం సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్ (25) నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట నుంచి ట్రాక్టర్‌లో మొరం సింగారానికి తరలిస్తుండగా, క్లచ్ విరిగిపోయింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ పైకిలేచి డ్రైవర్ సురేష్‌కు తీవ్రగాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న నడికూడలోని రైతు వేదిక

ఉత్సవ విగ్రహాలుగా వేదికలు

● 18 నెలలుగా రాని నిర్వహణ నిధులు ● నిరుపయోగంగా రైతు వేదికలు ● అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్న వైనం
● కొన్నిటిపైనే దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం ● దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్పునకు చర్యలు

"రైతు వేదికల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. కొత్త ప్రభుత్వం వీటిని ఏం చేస్తుందనేది కూడా తెలియడం లేదు. గత ప్రభుత్వం వీటిని అట్టహాసంగా ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ విషయంలో పట్టించుకోక పోవడంతో అవి అన్నీ నిరుపయోగంగా మారాయి. రైతు వేదికల నిర్వహణకు నిధులు ఇవ్వడం నిలిపివేయడంతో వాటి ఆలనాపాలనా చూసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారాయి. దాదాపు 18 నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో తెలియక పాట్లు పడుతున్నామని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా వీటిని పట్టించుకుంటుందని రైతులు భావించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు వేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం."

హనుమకొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన రైతు వేదికలు నిరుపయోగంగా తయారయ్యాయి. ఈ భవనాల నిర్మాణం పూర్తయినా అధికారులు వీటిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. చాలాచోట్ల భవనాలకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. పలుచోట్ల మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదన్న సాకుతో వాటిని నిరుపయోగంగా ఉంచుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట్లో ఈ రైతు వేదికలపై దృష్టి సారించింది. వీటిలో కొన్నిటిని ఎంపిక చేసి వీటిని రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. కానీ ఇంకా పూర్తిగా కార్యరూపం దాల్చలేదు.

ఆర్భాటంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఆరు జిల్లాలు - హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 515 రైతు వేదికలను నిర్మించారు. ఇందుకు రూ.113కోట్లను వెచ్చించారు. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.22 లక్షలను ఖర్చు చేశారు. ఈ మొత్తంలో రూ.10లక్షలను ఉపాధి హామీ పథకం నిధుల కింద సమకూర్చగా, మిగతా రూ.12లక్షలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. రైతు వేదికలలో ఏఈవో, రైతు వేదిక కోఆర్డినేటర్లకు ఒక్కొక్కటి చొప్పున చాంబర్, 200 మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రిసెప్షన్, రెండు మరుగుదొడ్లు నిర్మించేలా డిజైన్ చేశారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతు వేదిక తొలి భవనాన్ని జనగామ జిల్లా కొడకండ్లలో 2020 అక్టోబర్ 31న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అట్టహాసంగా ప్రారంభించారు.

నిర్వహణ భారం

రైతు వేదికల ప్రారంభ సమయంలో ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున విడుదల చేయడంతో నిర్వహణ సవ్యంగా సాగింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ రూ.9వేలలో పరిశుభ్రతో కోసం రూ.3వేలు, శిక్షణ ఖర్చుల కింద రూ.2,500, స్టేషనరీకి రూ.వెయ్యి, విద్యుత్‌చార్జీల కోసం రూ.వెయ్యి మరమ్మతులకు రూ.వెయ్యి, తాగునీటికి రూ.500 ఖర్చు చేసేవారు. అయితే గతంలో వేదికలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారు సైతం వేతనాలు ఇవ్వకపోవడంతో పనులకు రావడం లేదు. పలుచోట్ల ఏఈవోలే కొంత మొత్తాన్ని భరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నెలకు రెండుసార్లు పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. నిర్వహణకు నిధులు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

అసాంఘిక శక్తులకు అడ్డా..

రైతు వేదికల వద్ద భద్రత లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రివేళ కనీసం కాపలాదారులు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సమావేశాల నిర్వహణ కోసం ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. భద్రత లేకపోవడంతో ఎప్పుడేమి జరుగుతోందనని ఏఈవోలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతీ నెలా నిధులు కేటాయించడంతోపాటు కాపలాదారులను నియమించాల్సిన అవసరం ఉంది.

దృశ్య, శ్రవణ కేంద్రాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో కొన్నిటిని వాడుకలోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఎంపిక చేసిన కొన్ని వేదికలను వ్యవసాయంలో రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలు తీర్చిదిద్దాలని భావించింది. ప్రయోగాత్మకంగా మొదట రాష్ట్రవ్యాప్తంగా 32 రైతు వేదికలను ఇందుకోసం ఎంపిక చేసింది. ఇందులో పరకాల వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఉన్న రైతు వేదిక ఒకటి. కానీ తర్వాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనితో పలివేల్పులలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పలివేల్పులలో ఉన్న రైతు వేదికను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. పరకాల రైతు వేదికకు దృశ్య, శ్రవణ పరకరాలు మాత్రం వచ్చాయి. సంక్రాంతి పండుగ రోజున అంటే ఈనెల 15న ఈ కేంద్రాలకు ప్రారంభోత్సవం జరుగాల్సి ఉండింది. ఎందుకో ఆ కార్యక్రమం వాయిదా పడింది.

మిగతా వాటి పరిస్థితి ఏమిటి?

కొన్నిటి రైతు వేదికలను మాత్రమే దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చితే మిగతావాటి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. తర్వాతకాలంలో వీటిని కూడా దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్చుతుందా? లేక ఇంతటితోనే సరిపెట్టుకుంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైతేనే మిగతా రైతు వేదికలను కొత్త ప్రభుత్వం పట్టించుకునేట్టు కనిపిస్తుంది. లేదంటే వాటి పరిస్థితి అయోమయమే. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు. సీజన్లలో రైతులకు పంటలపై తగిన శిక్షణ ఇవ్వడానికి వీలుగా కనీసం నిర్వహణ ఖర్చులైన ఇవ్వాలని వారు కోరుతున్నారు. రైతు వేదికల్లో కనీసం ఒక స్వీపరును, వాచ్‌మెన్ అయినా నియమించాలని కోరుతున్నారు. లేకుంటే అవి క్రమంగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోని వస్తువులు దొంగలపాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



కాలిన గాయాలతో సతీష్

యజమాని తిట్టాడని ఆత్మహత్యాయత్నం

మేడారం, జనవరి 26: యజమాని తిట్టాడని పెట్రోల్ పోసుకొని యువకుడు నిప్పంటించుకున్న ఘటన తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతల గద్దెల ముఖద్వారం ఎదుట శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఊరుగొండకు చెందిన మేడిపల్లి సతీష్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా వరంగల్ జిల్లా కరీమాబాద్‌లోని ఆర్మూఖ బార్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం మేడారం వనదేవతల దర్శనానికి బార్ యజమాని, సతీష్‌తో పాటుగా సహ పనివారిని తీసుకువచ్చారు. వనదేవతల దర్శనం అనంతరం భోజనాల సమయంలో యజమాని మందలించడంతో సమ్మక్క సారలమ్మల దేవస్థానం ప్రధాన ద్వారం ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు మంటలు ఆర్పి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సతీష్ శరీరం 80 శాతం కాలిపోయిందని డాక్టర్లు తెలిపారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ పాఠశాల బస్సు



డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

వెంకటాపూర్ (రామప్ప), జనవరి 26: ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సైడ్ డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని రామాంజాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రానికి చెందిన నారాయణ హైస్కూల్‌కు చెందిన బస్సు 20మంది విద్యార్థులను ఎక్కించుకుని మండలకేంద్రం వైపు ప్రయాణమైంది. ఈక్రమంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో రామాంజాపూర్‌కు చేరుకోగానే అదుపుతప్పి సైడ్ డ్రెయినేజీలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టబోయి ఆగిపోయింది. డ్రైవర్ మద్యంమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈసంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గిరిజనుల అభివృద్ధే ఐటీడీఏ ధ్యేయం

గణతంత్ర దినోత్సవంలో ప్రాజెక్టు అధికారి అంకిత్



ఐటీడీఏ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పీవో అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 26: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంతో ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఐటీడీఏ జరిగిన వేడుకల్లో ఐటీడీఏ పీవో పాల్గొని పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల కార్యక్రమాలను సకాలంలో అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్నట్లు పీవో తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని, 21శాఖల ద్వారా రూ. 75కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పీవో తెలిపారు.

విద్యా విభాగం

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మొత్తం 25,572 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశామని, రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నామని పీవో తెలిపారు.

వైద్య విభాగం

ఐటీడీఏ పరిధిలో ఒక జిల్లా ఆస్పత్రి, మూడు సామాజిక ఆస్పత్రులు, 22ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 122 ఉప ఆరోగ్య కేంద్రాలున్నాయని, వానాకాలంలో దోమల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశమున్నా 174 ఏజెన్సీ గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో దోమ తెరల పంపిణీతోపాటు దోమల మందును పిచికారి చేసి రోగాలను అరికట్టామన్నారు. ఎంసీహెచ్ ఎపిడమిక్ స్కీం ద్వారా ఏప్రిల్ 2023 నుంచి డిసెంబరు 2023 వరకు 1473 మెడికల్ క్యాంపులు నిర్వహించి 69,492 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీవో తెలిపారు. మూడు ఉచిత అంబులెన్స్ పథకం ద్వారా ఇప్పటీ వరకు 3,973మందికి ఉచితంగా వైద్యసేవలందించమన్నారు. 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి న్యూట్రీషన్‌కిట్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

ఇంజనీరింగ్ విభాగం

ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆర్టిక్ 275 కింద గిరిజన భవనాలు, బీటీ రోడ్లు, పాఠశాలల మరమ్మతులకు రూ.528.44 కోట్లు నిధులు కేటాయించగా ఇందులో 1,055 పనులు పూర్తయ్యాయని, 104పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు. అదేవిధంగా ఐటీడీఏపరిధిలో 117 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలకుగాను రూ.500కోట్లు మంజూరు చేశామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 44సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలకు రూ.704లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇందులో 35పనులు పూర్తి కాగా 3పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు.

ట్రైకార్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు 2020-21, 2022 సంవత్సరానికి గాను 6,761 యూనిట్ల సబ్సిడీ మంజూరు అయ్యాయని, వాటిని మండలాల వారీగా విభజించి మండల అభివృద్ధి అధికారులకు పంపించి ఆన్‌లైన్‌లో పరిశీలించి ఇప్పటివరకు 3,318 యూనిట్లు మంజూరు చేశామన్నారు. సబ్సిడీ డబ్బులు త్వరలో విడుదల చేయనున్నట్లు పీవో వెల్లడించారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 3 ఇటుకల తయారీ యూనిట్లు, 4సెంట్రింగ్ యూనిట్లు, 4 కాంక్రీట్ మిక్స్, ఫుడ్ ట్రాక్ యూనిట్లు గిరిజనులకు మంజూరు చేశామని పీవో తెలిపారు.

గిరిజన మత్స్య పారిశ్రామిక

గిరిజన రైతులకు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సొసైటీలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 15 ఏజెన్సీ మండలాల్లో 814 చెరువులు ఉండగా 101 సొసైటీల రిజిస్ట్రేషన్ జరిగిందని, సొసైటీలకు రూ.కోటి70లక్షల 88వేల చేపపిల్లలను అందించామన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం ద్వారా 7చేపల చెరువులు నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశామని, 3యూనిట్లకుగాను రూ.14.8లక్షల సబ్సిడీని గిరిజనులకు విడుదల చేశామన్నారు. అదేవిధంగా గిరిజన మత్స్యకారులకు 37 బైక్‌లు, 2 ఆటోలను మంజూరు చేశామన్నారు.

గిరి వికాసం

గిరివికాసం పథకం ద్వారా గిరిజన రైతుల పొలాల్లో నీటి వసతుల కల్పన కోసం గిరి వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇందుకోసం గిరిజన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, ఇప్పటివరకు 3,018 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. దీనికిగాను రూ.954.98లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అదేవిధంగా గిరిజన సహాయనిధి పథకం కింద 476 మందికి రూ.51.17లక్షల నిధులను అందజేశామన్నారు. గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తోందని పీవో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని పీవో పిలుపునిచ్చారు. కాగా, ఐటీడీఏలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదరస్వామి, ఎస్ వో రాజ్ కుమార్, డీడీ పోచం, ఈఈ హేమలత, మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగలో ప్రొటోకాల్ రగడ

● బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట ● పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ
● ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఎగురవేసిన హైస్కూల్ హెచ్ఎం




జెండా కర్రను గుంజుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జనవరి 26 : జాతీయ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రోటోకాల్ రగడ శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా వద్ద గణతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఎగురవేసేందుకు జెండా కమిటీ నిర్వాహకులు ఎంపీపీ అంజయ్యను ఆహ్వానించారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అధికారులు మాత్రమే జెండా ఆవిష్కరణ చేయాలని, బీఆర్ఎస్ నాయకులు చేయవద్దని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఏర్పాటు చేసిన జెండాను తొలగించి కర్రను ఒకరికొకరు గుంజుకోవడం చేశారు. జాతీయ జెండా ఏర్పాటు కోసం నిర్వహణ కమిటీ రూ.20 లక్షల నిధులతో ఫెన్సింగ్, గార్డెనింగ్, సీసీకెమెరాల ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశామని, మేమే జెండా ఎగురవేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ అధికారులే జెండా ఆవిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతున్న జెండా వేడుకలకు అధికారులు ఎమ్మెల్యేను, ఇతర ప్రభుత్వ అధికారులను పిలవకుండా ప్రోటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వంద అడుగుల జెండాను ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తుంటే ప్రజా ప్రతినిధులను, అధికారులను పిలవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఇరు వర్గాలను హెచ్చరించారు. జెండా ఎగురవేయకుండా ఆపడం సరికాదని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జెల్ల లక్ష్మీనారాయణతో జెండా ఆవిష్కరణ చేపట్టారు. సంఘటనా స్థలానికి సీఐ సత్యనారాయణ, ఎస్సై జగదీష్, ఆర్డీవో నర్సింహ రావు, ఇతర అధికారులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ఒకే ప్రాంగణంలో రెండు జెండాలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ గణతంత్ర దినోత్సవ వేడుకల జెండా ఆవిష్కరించారు. అదే పాఠశాల ఆవరణలో ఉన్న వంద అడుగుల జాతీయ జెండా వద్ద ఏర్పాటు చేసిన మరో జెండాను కూడా హెచ్ఎం లక్ష్మీ నారాయణ ఆవిష్కరించారు. ఒకే ప్రాంగణంలో రెండు జెండాల ఆవిష్కరణపై హెచ్ఎం లక్ష్మీ నారాయణను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరించానని తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవిందర్‌రావు

డీసీసీబీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు

హనుమకొండ టౌన్, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను హనుమకొండలోని డీసీసీబీ హెడ్ ఆఫీస్‌లో ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మార్నేని రవిందర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, రవిరాజ, నరేందర్, సీఈవో ఎండీ.వజీర్ సుల్తాన్, డీజీఎం కురువ నాయక్, ఏజీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీ చేతుల మీదుగా ఉత్కృష్ట సేవాపతకాన్ని స్వీకరిస్తున్న రమేష్

ఒంటేరు రమేష్‌కు ఉత్కృష్ట సేవాపతకం

సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా స్వీకరణ

హనుమకొండ క్రైం, జనవరి 26: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచి)లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఒంటేరు రమేష్‌కు పోలీసు శాఖలో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఉత్కృష్ట సేవా పతకం లభించింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినకాలంలో స్థానిక ప్రజలకు విశేష సేవలను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిషలు కృషి చేసిందుకు కాగాను ఉత్కృష్ట సేవా పతకం లభించింది. శుక్రవారం వరంగల్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ల చేతుల మీదుగా పతకాన్ని స్వీకరించారు. తనకు ఉత్కృష్ట సేవాపతకం రావడం చాలా ఆనందంగా ఉందని, తన సేవలను గుర్తించిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రమేష్ తెలిపారు. రమేష్‌కు ఎస్‌బీ విభాగం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కిరణ్ కుమార్

రాష్ట్రస్థాయి ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్

హనుమకొండ అర్బన్, జనవరి 26: ఔషధ నియంత్రణ శాఖ హనుమకొండ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అవార్డును కిరణ్ కుమార్ అందుకున్నారు. విధి నిర్వహణలో కచ్చితత్వమే అవార్డు తెచ్చిపెట్టిందని పలువురు కెమిస్టులు ప్రశంసించారు.



అవార్డులు అందుకుంటున్న సిబ్బంది

జైలు సిబ్బందికి అవార్డులు

హనుమకొండ రూరల్, జనవరి 26: వరంగల్ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. కేంద్ర కారాగార డీజీ సౌమ్యామిశ్రా వారికి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో పరావస్తు వెంకటేశ్వరస్వామికి ఎక్స్‌లెన్స్ సర్వీస్ కింద రూ.5వేల క్యాష్ రివార్డు, డిప్యూటీ జైలర్ శెంకేసి వెంకటేశ్వర్లు ఔట్‌స్టాండింగ్ ఫెర్మామెన్స్ కింద, హెడ్‌వార్డర్ మెట్టు చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ టి.ప్రతిభారాణి అందుకున్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలు

జిల్లాలో ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవం


స్టేషన్‌ఘన్‌పూర్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న డాక్టర్ రాజయ్య


పాలకుర్తిలో జాతీయ జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ వెంకటేశం


లింగాలఘణపురంలో పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీడీవో


బచ్చన్నపేటలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్


చిలుపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి


తరిగొప్పుల కస్తూర్బాలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్‌వో రజిత

జనగామ కల్చరల్, జనవరి 26: జిల్లా వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జనగామ మండలంలోని అన్ని కార్యాలయాలు, విద్యా సంస్థలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఆయా కార్యాలయాల్లో పతాకావిష్కరణ గావించారు. యశ్వంతాపురం సీజేఐటీలో జరిగిన వేడుకల్లో కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ సి.ఉపేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధర్మకంచ 13వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరిప్రతాప్‌రెడ్డి తనయుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పాల్గొని పతాకావిష్కరణ చేశారు. స్థానిక ఏబీవీ హైస్కూల్‌లో కరస్పాండెంట్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభ, కిరణ్, గంగిశెట్టి ప్రమోద్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. వాసవి క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు మాదంశెట్టి వరూథిని పతాకావిష్కరణ చేశారు.

జనగామ జిల్లా కోర్టులో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రవీంద్ర శర్మ పతాకావిష్కరణ చేయగా సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏజీపీ రాంగోపాల్, పీపీ భిక్షపతి, చీఫ్ లీగల్ కౌన్సిల్ మంచాల రవీందర్, సీనియర్ న్యాయవాదులు ప్రసాదరావు, శ్రీరామ్ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, నాగరాజు శర్మ, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డీపీవో వినోద్‌కుమార్ ఆలపించిన అపురూపమైన దమ్మ ఆడ జన్మ పాట ఎంతగానో ఆకట్టుకుంది. కళాకారుడు శ్రీనివాస్ చేసిన వెంట్రిలాక్విజమ్ చూపరులను ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ శివ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.సుహాసిని, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, ఏఓ రవీందర్, సీపీఓ ఇస్మాయిల్, ఆర్డీఓ మురళీ కృష్ణ, డీఈఓ రాము, డీఐఈఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ జె.జయంతి, డీసీఎస్‌ఓ రోజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : మండల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామపంచాయతీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ వినయలత, ఎంపీడీవో సురేందర్‌నాయక్, ఎస్సై ప్రవీణ్, నోడల్ అధికారి విష్ణుమూర్తి, కేజీబీవీ స్పెషలాఫీసర్ అన్నపూర్ణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పకుమారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్‌రాజు, పశువైద్యాధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : గణతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణంరాజు, వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, ఎస్ఐ సతీష్, పీఏసీఎస్ వద్ద చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చిలుపూర్ : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రభుత్వ/ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు, ఎంపీడీవో పులుగు వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఎస్సై బొల్లం వినయ్ కుమార్, కార్యదర్శులు, ఎంపీవో మధుసూధన్, ఏపీవో మోహన్‌రావు, ఆర్పీఎస్ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, ఇల్లందుల సుదర్శన్, గజ్జెల దామోదర్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేష్ పాల్గొన్నారు.

● నర్మెట : మండలంలోని అన్ని గ్రామాలలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఐ సాయిరమణ, ఎస్సై శ్రీకాంత్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి ఎంపీడీవో ఖాజామొయినొద్దీన్, ఎంపీపీ తేజావత్ గోవర్దన్, జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి గంగం సర్సింహారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు పాల్గొన్నారు.

● తరిగొప్పుల : తరిగొప్పుల మండల కేంద్రంతో పాటు గ్రామాలో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టయ్య, ఎంపీడీవో దేవేందర్, కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఎస్సై డి.నరేష్, హెచ్‌ఎం రామచంద్రం, ఎస్‌వో రజిత, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు బీరెడ్డి జార్జిరెడ్డి, ఎంపీపీ జొన్నగోని హరిత, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాలను ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఎదుట ఎగురవేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో అశోక్ కుమార్, సీఐ విశ్వేశ్వర్, డాక్టర్ లింగమూర్తి, సర్పంచు వీరమనేని యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : మండలంలో గణతంత్ర దినోత్సవాన్ని అధికారులతో పాటు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యుగేందర్, ఎంపీడీవో హషీం, సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్.రఘుపతి, ఏవో శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఆర్ఐ బలరాం, ఏపీఎం సారయ్య పాల్గొన్నారు.

● దేవరుప్పుల : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలు గణతంత్ర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కె.శ్రవణ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ హుస్సేన్, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిన్సిపాల్ రాపోలు ప్రభాకర్, పీహెచ్‌సీలో వైద్యాధికారి రవితేజ, దేవరుప్పుల బాలయేసు పాఠశాలలో గెస్ట్ ఫాదర్ దిలీప్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

● జఫర్‌గడ్, జనవరి 26 : మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎస్ఐ మహేందర్, డాక్టర్ చంద్రమౌళి, జఫర్‌గడ్ జీపీ వద్ద సర్పంచ్ వెంకట నర్సింగరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆంజనేయరాజు పాల్గొన్నారు.

● కొడకండ్ల : మండల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలను జరుపుకున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, యూనియన్ ఆఫీసుల్లో జాతీయ పతాకాన్ని ఎగుర వేసి వందనాలు సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీవో నాగ శేషాద్రిసూరి, చైర్మన్ పేరం రాము, ఎస్ఐ శ్రవణ్‌కుమార్, వ్యవసాయ కార్యాలయంలో ఏఈవో నవ్య, అన్ని గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు, ఎంపీపీ జ్యోతి రవీంద్రనాయక్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పసునూరి మధుసూదన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు విద్య వ్యాపార, వాణిజ్య, యువజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వాడవాడన ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ ర్యాలీలు చేపట్టారు. స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు, ఆటో, డ్రైవర్స్ యూనియన్ నిర్వహించిన జెండా వందన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య జాతీయ పతాకం ఎగురవేశారు. ఘన్‌పూర్ ఆర్డీవో ఆఫీసు ముందు ఆర్డీవో రామ్మూర్తి జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ గట్టయ్య, సర్పం చ్ టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ ఆఫీసు వద్ద ఏసీపీ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆఫీసు వద్ద తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సట్ల రాజు, మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీకాంత్ పతాకావిష్కరణ చేశారు.


కలెక్టరేట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్లు


సీజేఐటీలో పతాకవందనం చేస్తున్న డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి


ఏకశిల పబ్లిక్ స్కూల్ వేడుకల్లో కరస్పాండెంట్ ఉపేందర్‌రెడ్డి


దేవరుప్పులలోని బాలయేసు హైస్కూల్‌లో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న గెస్ట్ ఫాదర్ దిలీప్‌కుమార్


జఫర్‌గడ్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్

ఘనంగా గణతంత్ర దినోత్సవం

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖాధికారి కె.రాము, వివిధ శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బచ్చన్నపేట కేజీబీవీ విద్యార్థులు తొలత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉర్రూతలూగించారు. జగతి శిఖలో జాబిలమ్మకు వందనం అంటూ మైత్రేయ కళాక్షేత్రం విద్యార్థులు ఉత్తేజపరిచారు. ఎత్తర జెండా... అంటూ జనగామలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు ప్రేక్షకులను అలరించారు. తలపై ఎర్రని టోపీ... ఎదపై ఎర్ర గులాబీ... అంటూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులు తమ వయస్సుకు మించి ప్రదర్శించారు. జఫర్‌గడ్ ప్రజాధర్మ సోషల్ వెల్ఫేర్ సొసైటీ విద్యార్థులు నెత్తురు మరిగితే ఎత్తర జెండా అంటూ దేశభక్తిని గొంతెత్తి చాటారు. ఈ సందర్భంగా గడ్డం సమ్మయ్య మనవరాలు గడ్డం వాసవిని కలెక్టర్ వేదికపైకి ఆహ్వానించి శాలువాతో అభినందించారు. ప్రదర్శనల్లో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందించారు. అంగన్‌వాడీ పిల్లలు 15 మందికి వాటర్ బాటిళ్లను బహూకరించారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి సన్మానం..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్య్ర సమరయోధులను గౌరవించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకల్లో లింగాలఘణపురం మండలం కళ్లెం గ్రామానికి చెందిన ఒకే ఒక్క సమరయోధుడు బహదూర్ సింగ్‌ను కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య శాలువాతో సత్కరించారు.

స్టాళ్ల సందర్శన..

వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ, వైద్య శాఖ, హార్టికల్చర్, ఐసీడీఎస్, పాడి పరిశ్రమాభివృద్ధి, చేనేత సహకార సంస్థలు, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, విద్యా శాఖ, ప్రజాపాలన, జిల్లా పర్యాటక శాఖ, పశు వైద్య మరియు పేదరిక నిర్మూలన శాఖ, మెప్మా, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ శివలింగయ్య అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్‌కుమార్ తిలకించారు. తదుపరి దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

గణతంత్ర వేడుకల సందర్భంగా జనగామ బస్సు డిపోకు చెందిన బస్సులను అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డీసీపీ సీతారాంతో కలిసి కలెక్టర్ శివలింగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న అధికారులు

జనగామ టౌన్, జనవరి 26 : గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వం జిల్లాలో 120 మందిని ఉద్యోగులను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసింది. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగిన గణంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ శివలింగయ్య ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఆయా శాఖల సిబ్బంది కలెక్టర్ చేతుల మీదుగా తమ శాఖ జిల్లా అధికారుల సమక్షంలో అవార్డులను స్వీకరించారు.


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ సుహాసిని


వాసం రామ్మూర్తి స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో


జె.జయంతి (డీడబ్ల్యూవో)


బి.నరేందర్‌రెడ్డి (డీఎంవో)


వినోద్‌కుమార్ (డీపీవో)


కృష్ణప్రియ (ఎక్సైజ్ సూపరింటెండెంట్)


జ్యోత్స్న (ఆర్టీసీ డీఎం)


అనిల్‌కుమార్ (జడ్పీ సీఈవో)


జి.ధన్‌రాజ్(డైరీ డెవలప్‌మెంట్ డీడీ)


ఎం.శ్రీధర్ (డీఎల్‌ఎం)


బాలు మహేంద్ర (కలెక్టర్ హెచ్‌హెచ్‌పీ)


సురేందర్‌రెడ్డి(ఏసీపీ, వరంగల్ ఏఆర్)


ఎం.హుస్సేన్(విద్యుత్ డీఈ, స్టేషన్‌ఘన్‌పూర్)


బి.రజని(డీవో, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్)


విశాలాక్షి(తహసీల్దార్, బచ్చన్నపేట)


వెంకటేశ్వర్లు (తహసీల్దార్, స్టేషన్‌ఘన్‌పూర్)

ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న సెయింట్ పాల్స్ స్కూల్


వేడుకలకు సిద్ధమైన సెయింట్ పాల్స్ స్కూల్

జనగామకల్చరల్, జనవరి 26: జనగామ జిల్లాకేంద్రంలోని సెయింట్ పాల్స్ స్కూల్ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలో ముందుకు దూసుకెళుతోంది. వరంగల్ డయాసిస్ సెయింట్ పాల్స్ సంస్థ వారిచే 1998లో జనగామ పట్టణంలో క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల నెలకొల్పబడి ఉన్నతంగా కొనసాగుతున్న తరుణంలో జనగామలో తమ సేవలను పాఠశాల స్థాయిలో కూడా విస్తరించాలనే యోచనతో 1999లో ప్రతిష్టాత్మకంగా స్థాపించబడింది. సెయింట్ పాల్స్ స్కూల్ పేరుతో 200 మంది విద్యార్థులతో ప్రారంభమై నాటి నుంచి నేటి వరకు అనేక ఇబ్బందులను, ఒడిదొడుకులను, ఆటంకాలను అధిగమిస్తూ ఈనాడు ఈ స్థాయికి చేరిందని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి కోసం మినీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లాంగ్వేజ్ ల్యాబ్ కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. నూతన విద్యా బోధనలో భాగంగా ఐఐటీ ఫౌండేషన్ కూడా ప్రారంభించి విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తూ సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న మన పాఠశాల ప్రగతిని మెచ్చి జాతీయ సైన్స్ విభాగం వాళ్లు జనగామ జిల్లా మొత్తానికి కలిపి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఈ స్కూల్లోనే ఏర్పాటు చేయడం విశేషం. ఎప్పటికప్పుడు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతులను వెలిగిస్తూ విజయపథంలో సెయింట్ పాల్స్ హైస్కూల్ ముందుకెళుతుందని, త్వరలో వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమవుతుందని వారు పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి

చిలుపూర్, జనవరి 26 : మండలంలోని పల్లగుట్టలో శుక్రవారం తాటిచెట్టు పైనుంచి జారిపడి గీతకార్మికుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన ఉమ్మగోని గోపాల్ (50) కల్లు గీసేందుకు తాటివనంలోకి వెళ్ళాడు. చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

పశుగ్రాసాన్ని దహనం చేయడం బాధాకరం

▸▸ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

చిలుపూర్, జనవరి 26: పశువుల దాణాను గుర్తు తెలియని దుండగులు దహనం చేయడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లిలో బాధిత రైతు, సమ్మక్క జాతర కమిటీ మాజీ చైర్మన్ మోతె శ్రీనివాస్ కుటుంబాన్ని ఆయన కలిశారు. గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలం దగ్గరికి వెళ్ళి ఇటీవల గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో కాలిబూడిదైన గడ్డికట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వ్యక్తులకు మధ్య బేదాభిప్రాయాలు ఉంటే నేరుగా చూసుకోవాలి తప్పితే, మూగ జీవాలపై వారి ప్రతాపం చూపడం బాధాకరమన్నారు. తక్షణమే నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కంకటి రవిందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు ఆకుల కుమార్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రచ్చ రవి, మేకల రమేష్, రంగు హరీష్ పాల్గొన్నారు.

ఐలమ్మ పేద కుటుంబంలో పుట్టినందునే చరిత్ర బయటకు రాలేదు

▸▸ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 26 : తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, విస్నూరు దొరలను గడగడ లాడించిన వీరనారి చాకలి ఐలమ్మ పేద కుటుంబంకు చెందిన వ్యక్తి కావడం వల్లనే ఆమె చరిత్ర బయటకు రాలేదని, రచనలు చేసే వారు కూడా ఉన్నత వర్గాలకు చెందిన వారైనందునే రచనలు చేయలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కడియం ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్నూరు రాంచందర్ రెడ్డిని ఎదిరించిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. అప్పటి దొరలు రైతుల నుంచి భూములు లాక్కోవడం, రైతులు పండించిన పంటను సైతం లాక్కోవడం లాంటి దుర్మార్గ పనులు చేయడాన్ని ఎదిరించి నిలబడిన వీరనారి ఐలమ్మ అన్నారు. ఐలమ్మ పండించిన పంటను లాక్కొని వెళ్లేందుకు ప్రయత్నించిన దొరలపైన తిరగబడిన ఆమె పోరాట స్ఫూర్తితో తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమం వచ్చిందన్నారు. ఐలమ్మ పోరాట పటిమను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా ఉమాదేవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, రజక సంఘం మండల కన్వీనర్ ఆక్కెనపల్లి అంజయ్య, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాపోలు మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో విషాదం

▸▸ విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి

▸▸ జెండా గద్దెపై పైపు అమర్చుతుండగా ప్రమాదం

▸▸ ములుగు జిల్లా కేంద్రంలో ఘటన


అంజిత్ (ఫైల్)


విజయ్ (ఫైల్)

ములుగు, జనవరి 26: చెమటోడ్చితేనే కానీ పూట గడవని జీవితాలు ఆ యువకులవి.. రోజువారి కూలీపనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.. దేశభక్తిని నరనరాన ఇనుమడించుకున్న వారు గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని శివాల యం(నగరేశ్వరస్వామి దేవాలయం) ఎదుట ప్రతీఏడు లాగే గణతంత్ర వేడుకలు జరిపేందుకు స్థానిక యువకులు ఏర్పాట్లు చేశారు. పరిసరాలలో భారతదేశ చిత్రపటాన్ని వేశారు. చుట్టూ తోరణాలు కట్టారు. ఉదయం 9.20 గంటల సమయంలో జాతీయ జెండా కట్టిన ఇనుప పైపును గద్దెపై అమర్చే క్రమంలో పైనున్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆ పైపును పట్టుకున్న ల్యాడ విజయ్, బోడ అంజిత్, బోడ కల్యాణ్ చక్రవర్తి షాక్‌కు గురై కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంజిత్(36) మృతి చెందగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్(25)కు సీపీఆర్ చేసిన వైద్యులు కాపాడే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికే ఆయన కూడా మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్ చక్రవర్తికి ప్రథమ చికిత్స చేయడంతో కోలుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని కుటుంబసభ్యులు హనుమకొండకు తరలించారు. మృతులిద్దరూ నిరుపేద దళిత కుటుంబానికి చెందినవారు. అంజిత్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. గృహ నిర్మాణ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేసే అంజిత్ రోజువారి కూలీ డబ్బులతో భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. అవివాహితుడైన విజయ్ స్థానికంగా ఓ కూల్‌డ్రింక్ డీలర్ వద్ద పనిచేస్తున్నారు. కొద్ది క్షణాల క్రితం వరకు తమ కళ్లెదుటే ఉన్న వారు విగతజీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు బోరున విలపించారు. కుటుంబ పెద్ద మరణించడంతో తాను, ముగ్గురు పిల్లలం అనాథలయ్యామని అంజిత్ భార్య లావణ్య రోదించింది. వృద్ధాప్యంలో ఉన్న తమను చూసుకుంటున్న ఒక్కగానొక్క కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడంటూ విజయ్ తల్లిదండ్రులు లక్ష్మి-శంకర్ కన్నీరు పెట్టుకున్నారు. ఏరియా ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి సీతక్క

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రికి వచ్చి మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ సాయంగా ప్రభుత్వం తరపున రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం, రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.